అప్పటి దాంక ప్రజా సంఘాలతోని నడిచిన తెలంగాణ ఉద్యమం బీఆర్ఎస్ రాకతోని కాకందుకున్నది. రాజకీయ పార్టీ సారథ్యం తెలంగాణ పోరాటానికి ఊపుతెచ్చింది. ఆ ఊపులో తెలంగాణ పాట మారింది. ''తెగదెంపుల యుద్ధమో నిచ్చేదారి కోయిలా'' అంటూ ఇగ తెలంగాణకు ఆంధ్రకు పొత్తు కలవదనే కోణంలో వరంగల్ శ్రీనివాస్ రాసిన పాటలోని అక్షరాలు తెలంగాణ ఆకాంక్షకు అద్దం పట్టినయి. ఈ పార్టీ సభలు, ప్రజాసంఘాల సభలకు జనం తండోపతండాలుగా తరలివస్తుంటే సీమాంధ్ర ప్రభుత్వం ఒకడుగు వెనక్కి తగ్గక తప్పలే. అప్పటిసంది పత్రికల్లో పాటలు పతాక శీర్షికలయినయి. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఉద్యమ సభలను పాటలు ఉద్రూతలూగించినయి. అప్పటిదాంక తెలంగాణ బతుకు గోసనే పాడుకున్న తెలంగాణ పాట కేసీఆర్ రాకతో 'అందుకోర గుతుపందుకో ఈ దొంగల తరిమేటందుకై' అంటూ గర్జించింది. ''అమ్మోనివా.. నువ్వు అయ్యోనివా/ తెలంగాణోనికి తోటి పాలోనివా'' గూడ అంజన్న సమైక్యవాదుల్ని ప్రశ్నించిండు. ''పుడితొక్కటి సత్తెరెండు రాజన ఓ రాజన / ఎత్తుకొ తెలంగాణ జెండా రాజన ఓ రాజనా'', ''గజ్జెలు గజ్జెలు రెండు గజ్జెలో రాజన్నా'' అంటూ రసమయి జనం గొంతులో రాగమైండు. తెలంగాణ ప్రజా ఉద్యమానికి ప్రాణమైండు. ''ఎందక జూద్దామురో ఎల్లన్నోరి మల్లన్నా/ ఇగ ఎగబడదామురో ఎల్లన్నోరి మల్లన్నా'' అంటూ




**వీరులల్లారా వీర వనితల్లారా**
**అమ్మ రుణముకై రణముల ఒరిగినారా**
**తెలంగాణలోన కంటి చెమ్మల్లారా**
**నును వెచ్చని నెత్తురు చిమ్మినారా**

**పాట:** వీరుల్లారా వీర వనితల్లారా
**రచన:** యశ్‌పాల్













## ఢిల్లీపై యుద్ధం

**పసునూరి** రవీందర్ రాసిన ''ఊరు వాడ ఒక్కటయ్యి ఉద్యమించిరన్నో జైకొట్టి తెలంగాణ'' తెలంగాణ పాట రింగ్‌టోనై మోతమోగింది. ఈ పాట తెలంగాణ ఉద్యమానికి కొత్త ఊపు తీసుకొచ్చింది. కోదారి శ్రీనివాస్ బొంబాయి పాటను వేదికల మీద ప్రదర్శించిన పైలం సంతోష్ ''ప్రజా తెలంగాణకై రండన మీరు రండనో'' అంటూ ఉద్యమ గానం చేసిండు. ఇంత కొట్లాడుతున్నా, ఇన్ని ప్రాణాలు పోతున్నా ఈ సీమాంధ్ర ప్రభుత్వానికి కనికరం లేదని స్వయంగా ''పాలనా ఏం పాలనా ఇది ఫాసిస్టు పాలనా / పాలనా ఏం పాలనా కాంగిరేసు పాలనా'' అంటూ దుమ్మెత్తిపోసిండు. ఎగిరి దునికి ఎత్తిపోతలైనడు. ''అమ్మా సోనియమ్మ ఓ తల్లీ సోనియమ్మ / ఓ ఢిల్లీలున్న బొమ్మ తెలంగాణ ముచ్చటమ్మ'' అంటూ ఢిల్లీ కాంగ్రేసు పీఠాన్ని కదిలించే ప్రయత్నం చేసిండు బోడ చంద్రప్రకాశ్.

ఉద్యమాన్ని ఉధృతం జేసిండు. ''తరగనీ సంపదున్నా నా తెలంగాణ/ నిరుపేద నీవైతివో నా తెలంగాణ/ వలసవాదుల చేతిలో నా తెలంగాణ/ అరిగోస బడుతున్నవో నా తెలంగాణ'' అంటూ మాట్ల తిరుపతి రాసిన పాట ఎందరినో కదిలించింది. ''తెలంగాణ ముద్దుబిడ్డల్లార తేరుకోరేందిరో/ తల్లి తెలంగాణ భంగపడుతుంటే బాధ లేదేందిరో'' అంటూ గుడిపల్లి రవి ఆర్తితో, ఆక్రోశంతో గానం చేసిండు. తెలంగాణ చైతన్యాన్ని, అమాయకత్వాన్ని, త్యాగాన్ని గానం చేసిన భిక్షపతి పాట ''తెలంగాణ పల్లేలల్ల లొల్లి లేసెరా/ వలసవాదులకు ఒళ్లు జల్లుమనేరా'' అంటూ ఉద్యమ వాస్తవికతను ఎలుగెత్తి చాటిండు. తానో పాటై, అసహాయుల ఆయుధమైండు.

### ఉస్మానియా క్యాంపస్‌లో...

''అన్నా చెల్లెలి అనుబంధం/ జన్మజన్మలా సంబంధం'' వంటి హిట్ పాటలతో సినీ పరిశ్రమలో ప్రత్యేక గుర్తింపు ఉన్న కవి అభినయ శ్రీనివాస్. పాటల్లోనే కాదు ఆచరణలోనూ అనుబంధాలను వదులుకోని కవి తెలంగాణ తమ్ముళ్ల త్యాగాలకు చలించి ఉద్యమ పాటల్లిండు. ''ఉస్మానియా క్యాంపస్‌లో ఉదయించిన కిరణమా/ వీర తెలంగాణమా/ వీర తెలంగాణమా నాలుగుకోట్ల ప్రాణమా'' అంటూ పది జిల్లాలకు తెలంగాణ ఉద్యమ ఊపందించిండు. తెలంగాణ ఉద్యమ సాహిత్యాన్ని ఎంతగానో ప్రభావితం చేసిండు. భావానికి తగ్గ బాణీని ఎన్నుకొని తనదైన శైలిలో పాట రాయడం మిట్టపల్లి సురేందర్ ప్రత్యేకత. ఈయన రాసిన ''రాతి బొమ్మల్లోన కొలువైన శివుడా/ రక్త బంధం విలువ నీకు తెలియదురా'' పాట గుండెల్ని పిండేసింది. మిట్టపల్లికి నంది అవార్డు తెచ్చి పెట్టిన ఈ పాట సాయిచంద్‌ను అద్భుతమైన గాయకుడిగా నిలబెట్టింది. ''ఓ యుద్ధం బుడితే ఓయు నిలువుటద్దం బట్టెరా'' అంటూ యుద్ధ భూమిని తలపించిన ఉస్మానియా విశ్వవిద్యాలయాన్ని ఉద్యమ పదాలతో అల్లుకున్నడు.

### అమరులకు జోహార్.. వీరులకు జోహార్

''వీరుల్లారా వీర వనితల్లారా/ అమ్మ రుణముకై రణములొరిగినారా'' అంటూ తెలంగాణ ధూంధాం వేదికల జోలపాడి ఉయ్యాలలూపింద్రు. విద్యార్థుల బలిదానాలను చూసిన విమలక్క ''ఎందుకు కాలిపోతవు/ నీవెందుకు రాలిపోతవు'' తన ఆటపాటకు తానే అక్షరాలను పొదువుకున్నది. ఆశువుగా కైగట్టి ఆర్ద్రంగా ఆలపించింది. తెలంగాణ రాష్ట్ర సాధనకు కారణమైన అంశాలేమిటో, తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలేమిటో, తెలంగాణ ఆకాంక్షలేమిటో, ఆలోచనలేమిటో కేసీఆర్‌కు తెలిసినంతగా మరొకరికి తెలిసే అవకాశం లేదు. పద్నాలుగేండ్లు సుదీర్ఘ పోరాటంలో పాటే ఆయుధంగా అడుగేసిండు. పాటలకు పదాలను అందించిండు. ఆఖరికి ''గారడి జేస్తుంద్రు గడబిడ జేస్తంద్రు'' అంటూ సీమాంధ్రుల నాయకత్వ పోకడలను వ్యంగ్యంగా ఎండగడుతూనే తన సాహిత్యాభిలాషను, పదాల తృష్ణను తీర్చుకున్నడు. మొత్తానికి అరవై సంవత్సరాల సుదీర్ఘ తెలంగాణ పోరాటంలో, కేసీఆర్ సారథ్యంలో సాగిన పదమూడేండ్ల సరికొత్త ఉద్యమదారుల్లో విద్యార్థులు, ఉద్యోగులు, మేధావులు, కవులు, కళాకారులు, సకల జనులు ఏకమై కదిలింద్రు. అందుకే అరవై సంవత్సరాలు ఎవరికీ సాధ్యం కాని చిరకాల స్వప్నం ఆయన నేతృత్వంలో సాకారమయ్యింది. 2014 జూన్ 2న పది జిల్లాల తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించింది. ఆ ఉద్యమపాటను, అమరుల త్యాగాలను తెలంగాణ ఎన్నటికీ మరచిపోదు. ఆత్మబలిదానాలతో తెలంగాణ రాష్ట్రం సాకారమైంది. ఈ రాష్ట్రం ఉన్నంత కాలం నందిని సిధారెడ్డి రాసిన ''అమరులకు జోహార్ వీరులకు జోహార్'' స్మృతిగీతం జాతి గుండెల్లో ప్రతిధ్వనిస్తుంది. అమర వీరులకు జోహార్లు. జై తెలంగాణ. ■